
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 19 ఆగస్టు 2024 | 3



సోమవారం రాఖీ పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా మార్కెట్లు కిటకిటలాడాయి. అమలాపురం, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం, రావులపాలెం, కొత్తపేటలో రాఖీలు అమ్మే దుకాణాలు రద్దీగా మారాయి. పలువురు మహిళలు, యువతులు తరలివచ్చి రాఖీలు కొనుగోలు చేశారు. స్వీట్ల దుకాణాలు కూడా రద్దీగా మారాయి.




మండపేట మెయిన్‌రోడ్డులో రద్దీ


మండపేటలో రాఖీ దుకాణాల వద్ద సందడి

పోరాట యోధుడు పాపన్నగౌడ్

కామనగరువులో విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు ప్రముఖులు



అమలాపురం రూరల్, ఆగస్టు 18: బహుజనులను ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఘనత సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్‌కు దక్కుతుందని తెలంగాణ పోలీసుశాఖ ఐజీ వెలివెల సత్యనారాయణగౌడ్ చెప్పారు. బహుజనుల ఆత్మ గౌరవం కోసం నిరంతరం పోరాటం చేసిన పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. కామనగరువులో ఆదివారం నూతనంగా నిర్మించిన పాపన్నగౌడ్ నిలువెత్తు విగ్రహాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి ఐజీ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు కోనసీమ గౌడ సంఘ అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు(భీముడు) అధ్యక్షత వహించారు. సామాన్య కుటుంబంలో జన్మించిన పాపన్నగౌడ్ పెత్తందారులను ఎదురించి నిరంకుశత్వ పాలన నుంచి విముక్తి కల్పించిన ఘట్టాలను ప్రతీ ఒక్కరూ నిరంతరం స్మరించుకోవాలన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ సర్దార్ పాపన్నగౌడ్ సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత నేటితరం యువతపై ఉందన్నారు. ఆయన చేసిన సాహసోపేత పోరాటాలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, విశ్రాంత డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్, నాయకులు బొర్రా ఈశ్వరరావు, అల్లాడ సోంబాబు, శిరిగిబత్తిన రాజరాజేశ్వరి, కామన మధు, రేలంగి దుర్గారావు, అధికారి జయవెంకటలక్ష్మి, పెచ్చెట్టి విజయలక్ష్మి, మట్ట సత్తిబాబు, రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్, దాసరి గోవిందరావు, కామన గంగాధరరావు, రాజులపూడి మహేష్, వేములు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ హరీష్


గంటి పెదపూడిలో వరదల సమయంలో పండుమిర్చి(ఫైల్)


వరదల సమయంలో కుళ్లిన కూరగాయల పంట(ఫైల్)

తేలిన లెక్క

1926 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం
అందాల్సిన పరిహారం రూ.4.05 కోట్లు

వరద నష్టం ఎంతనేది బాధితులకు వెంటనే తెలిసినప్పటికీ అధికారిక లెక్కల్లో మాత్రం ఇప్పుడిప్పుడే బయట పడుతోంది. ఉద్యానవన శాఖాధికారులు మొత్తానికి నష్టాలను తేల్చేశారు. వరదలు పోటెత్తడంతో లంక గ్రామాల్లో సన్న, చిన్న కారు రైతులతో పాటు రైతు కూలీలకు ఉపాధి కరువైంది. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబాలు, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. సహజంగా లంక గ్రామాల్లో ఎక్కువ శాతం ఉద్యాన పంటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఉన్న కొద్దిపాటి భూముల్లోనే తొలకరి పంటలుగా బీర, బెండ, పచ్చిమిర్చి, వంగ, ఆనబ, మునగ సేద్యం చేస్తుంటారు. ఈ పంటలైతే స్వల్పకాల వ్యవధిలో ఆదాయం చేతికొస్తుందని ఉద్దేశంతో వాటినే పండిస్తుంటారు. పండించిన పంటలను ప్రతి రోజు ద్విచక్ర వాహనాలపై సమీపంలోని మార్కెట్‌లోకి తీసుకువెళ్లి విక్రయించి వచ్చిన సొమ్ముతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి తీసుకువస్తుంటారు.

ఉద్యాన రైతుకు కన్నీరే

గోదావరికి వరదలు రావడంతో లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు పూర్తిగా నీటమునగడంతో చేతికి వచ్చిన పంటలు గోదారి పాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూరగాయలకు మంచి గిరాకీ ఉండటంతో గోదారమ్మ పరవళ్లలో రైతుల ఆశలు ఆవిరైపోయాయి. ఇక వాణిజ్య పంటలైన తమలపాకు, అరటికి కూడా నష్టం వాటిల్లింది. తమలపాకు తీగలకు గోదావరి నీరు తాకితే చాలు పూర్తిగా మాడిపోతాయి. అలాగే అరటిలో దీర్ఘకాలికంగా వరదనీరు నిలిచి ఉంటే ఊటవేసి ఆకులు పసుపు రంగుగా మారి దిగుబడి గణనీయంగా పడిపోతుంది. అంతే కాకుండా లంకల్లో పచ్చిక బయళ్లు కనుమరుగు కావడంతో పశుగ్రాసానికి పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండు గడ్డికి గిరాకీ రావడంతో పశుగ్రాసం కోసం లంక ప్రాంతాల్లో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కాగా గోదారమ్మ శాంతించిన తర్వాత ఉద్యానవన శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు ఆపై పూర్తిస్థాయిలో నష్టాల వివరాలను ప్రభుత్వానికి అందించారు.

ఇవీ వివరాలు

పి.గన్నవరం, ఆగస్టు 18:

అరటి 759.65 హెక్టార్లు, తమలపాకు 28.92 హెక్టార్లు, పువ్వులు 0.39 హెక్టార్లు, బొప్పాయి 74 హెక్టార్లు, కూరగాయలు 1063 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు ప్రకటించారు. హెక్టారుకు అరటికి రూ.25 వేలు, తమలపాకుకు రూ.75 వేలు, బొప్పాయి, పువ్వులు, కూరగాయలకు రూ.17 వేలు చొప్పున రైతులకు పరిహారం అందించేందుకు తుది జాబితాను సిద్ధం చేసి సమర్పించామని, రైతుల ఖాతాలకు పరిహారం అందేలా సిఫార్సు చేసినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి తెలిపారు.

1,926 హెక్టార్లలో నష్టం

ఇటీవల వరదలకు జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటలకు జరిగిన నష్టాలను సంబంధిత అధికారులు తేల్చేశారు. ఉద్యాన పంటలకు జరిగిన నష్టాలను నమోదు చేశారు. తొలుత వరదలు కారణంగా జిల్లా వ్యాప్తంగా 2,398 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు సంబంధిత అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. అనంతరం ఈనెల 12వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సిబ్బందితో కలిసి ఉద్యాన శాఖ సిబ్బంది సంయుక్తంగా పంటల నష్టాలు వివరాలను, రైతుల జాబితాను సిద్ధం చేశారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి గ్రామస్థాయిలో 33 శాతం కంటే ఎక్కువ నష్టపోయిన పంటల వివరాలు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 6,183 మంది రైతులకు సంబంధించి 1926.73 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు నష్టపోయాయని జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ తెలిపారు. దీనికి గాను నష్టపోయిన రైతులకు రూ.4.05 కోట్లు నష్టపరిహారం అందించేందుకు జిల్లా ఉన్నతాధికారి ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించారు.


అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం, ఆగస్టు 18: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రంలో ఆదివారం స్వామివారికి అష్టోత్తర పూజలు నిర్వహించారు. స్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక రోజు ఆదాయం రూ.2,85,502 లభించినట్టు ఆలయ ఉప కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. అలాగే వకులమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రావులపాలానికి చెందిన గంధం రామారావు-సూర్యవెంకటలక్ష్మి దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం బహూకరించారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అమలాపురం టౌన్, ఆగస్టు 18: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు.

నివాళి


సఖినేటిపల్లి మండలం వీవీ మెరకలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న కూటమి నేతలు (అంతర్వేది)

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అమానుష దాడికి సంబంధించి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా రెండో రోజు కూడా వివిధ ప్రజా, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. పలు చోట్ల కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు..

వార్తలు 6లో


ఈతకోట-గంటి రోడ్డు నుంచి పూజారిపాలెం ఈతకోట పంటపొలాలకు వెళ్లే పుంతరోడ్డు దుస్థితి

- ఆధునికీకరణకు నోచుకోని పుంతరోడ్లు
- పూర్తిగా ఛిద్రమైన వైనం
- వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు


గోపాలపురం జాతీయ రహదారి నుంచి ఈతకోట-గంటి రోడ్డుకు వెళ్లే కాలువగట్టు ఛిద్రమైన దృశ్యం


ముమ్మిడివరప్పాడు ప్రధాన రహదారి నుంచి ఈతకోట పంట పొలాలకు వెళ్లే పుంత రోడ్డు ఛిద్రమైన దృశ్యం

పుంతలు.. గుంతలు

రావులపాలెం, ఆగస్టు 18:

రైతులు నిత్యం సాగుచేసే పంట పొలాలకు రాకపోకలు సాగించి పంటలు తరలించుకునే పుంత రోడ్లు అధ్వాన్నంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం వాటి ఆధునికీకరణకు ఒక్క రూపాయి కూడా వెచ్చించిన దాఖలాలు లేవు. దీంతో ఆ పుంత రోడ్ల మీదుగా రాకపోకలు సాగించేందుకు పంటలు తరలించుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రావులపాలెం మండలంలో వరిసాగుతో పాటు రైతులు వివిధ పంటలు సాగు చేస్తుంటారు. రైతులు పంట పొలాలకు కావాల్సిన ఎరువులను తీసుకువెళ్లడం, పండించిన పంటలను మార్కెట్లకు తరలించుకోవడం వంటి కార్యకలాపాలు ఈ పుంత రోడ్ల మీదుగా సాగిస్తుంటారు. ఈ రహదారులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో కనీసం నడిచివెళ్లేందుకు వీలులేక ఇబ్బందులు పడుతున్నారు.


ఈతకోట, గోపాలపురం పొలాలకు వెళ్లే దారి

వాణిజ్య పంటలైన అరటి, కూరగాయలను రైతులు మార్కెట్లకు తరలించుకునేందుకు నెత్తిన పట్టుకుని తీసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ధాన్యం మాసూళ్ల సమయంలో ఈ పుంత రోడ్లులోకి లారీలు, ట్రాక్టర్లు వెళ్లలేకపోవడంతో బస్తాకు ఇంత అని జట్టు కూలీలకు అదనంగా చెల్లించి ప్రధాన మార్గం వద్దకు మోయించుకునే పరిస్థితి ఏర్పడింది. అసలే ఆధునికీకరణ లేక అధ్వాన్నంగా ఉన్నాయి పైగా ఇప్పుడు వర్షాకాలం కావడంతో బురదమయంగా మారి రైతులు నరకయాతన పడుతున్నారు. మండల పరిధిలోని గోపాలపురం జాతీయ రహదారి నుంచి ఈతకోట గంటి రోడ్డు వరకు ఉన్న ముమ్మిడివరప్పాడు కాలువగట్టు రోడ్డు, ముమ్మిడివరప్పాడు ప్రధాన రహదారి నుంచి ఈతకోట పంట పొలాలకు వెళ్లే పుంతరోడ్లు ఈతకోట గోపాలపురం పంట పొలాలకు వెళ్లే పుంత రోడ్డు, ఈతకోట గంటి రోడ్డు నుంచి పూజారిపాలెం ఈతకోట పంట పొలాలకు వెళ్లే పుంత రోడ్డుతో పాటు మండల పరిధిలోని గ్రామాలలో పంట పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పుంత రోడ్లు అధ్వానంగా మారడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పండించిన పంటల ద్వారా మార్కెట్ కమిటీకి పన్నుల రూపంలో లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతుంది. గత వైసీపీ పాలనలో మార్కెట్ కమిటీల ద్వారా పుంత రోడ్ల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేసిందిలేదు. ఈ నిధులను వేరే అవసరాలకు మళ్లించారన్న చర్చ అప్పట్లో జరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పుంత రోడ్ల ఆధునికీకరణపై దృష్టి సారించి రైతులు తమ వ్యవసాయోత్పత్తులను మార్కెట్‌లకు తరలించుకోవడానికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. గత టీడీపీ హయాంలో పుంత రోడ్లుకు మోక్షం కలగడంతో అదే కూటమి ప్రభుత్వంలో ఈ రహదారుల అభివృద్ధి చెందుతాయని రైతుల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





నాణ్యత లోపించిన దుశ్శర్తి-పోలవరప్పాడు రోడ్డు పనులు.. ఉపాధి హామీ పని కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం

ఉపాధి రోడ్డులో నిధులు మింగేసిన ఇంజనీర్లు

- అడ్డతీగల మండలంలో న్యాయమూర్తుల పర్యటనలో వెలుగుచూసిన బాగోతం
- మెటల్ రోడ్డు పేరుతో అడ్డంగా దోపిడీ
- రూ.90 లక్షలతో చేపట్టిన మెటల్ రోడ్డు నిర్మాణమంతా డొల్ల
- ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు ఒక్కటై నిధుల స్వాహా?

రంపచోడవరం, ఆగస్టు 18: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉపాధి పనుల్లో ఇంజనీర్లు, గుత్తేదార్లు కుమ్మక్కై నిధులు మింగేసిన వైనమిది. అడ్డతీగల మండలంలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో 2.5 కిలోమీటర్ల మేర దుశ్శర్తి-డి.పోలవరప్పాడు మెటల్ రోడ్డు నిర్మాణాన్ని 2023 ఆగస్టులో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టారు. ఈ రహదారుల్లోని నాణ్యతా లోపాలు ఇటీవల కురిసిన వర్షాలతో బయటపడ్డాయి. ఇటీవల జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశబాబు, అడ్డతీగల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ పి.బాబు న్యాయవాదులతో కలిసి అడ్డతీగల జ్యూడీషియల్ మేజిస్ట్రేటు కోర్టు పరిధిలో రహదారులులేని గ్రామాలను పరిశీలించారు. అడ్డతీగల మండలంలోని దుశ్శర్తి పరిధిలోని డి.చోడవరం, పోలవరప్పాడు గ్రామాల సందర్శన చేసిన సందర్భంలో ఈ దుశ్శర్తి-పోలవరప్పాడు రోడ్డు అధ్వానస్థితి వారి దృష్టికి వచ్చింది. ఈ మెటల్ రోడ్డు నిర్మాణం జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టగా, ఇందులో ఈ రోడ్డు పరిసర గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించడమేకాకుండా, ఇందులో మెటీరియల్ కోసం కూడా నిధులను కేటాయించారు. నిర్మాణంలో అనుసరించాల్సిన నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడం, నాణ్యమైన మెటీరియల్‌ను వినియోగించకపోవడం, సరైన రోలింగ్ చేయకపోవడం వంటి అనేక కారణాలు ఈ రోడ్డును అధ్వానస్థితికి తీసుకువచ్చాయి. ఎక్కడా కూడా పూర్తిస్థాయిలో మెటల్‌ను వినియోగించిన దాఖలాలే కానరావడంలేదు. మొక్కుబడిగా మెటల్‌ను జల్లి, పరిసరాల్లో అందుబాటులో ఉన్న మట్టిని వినియోగించి నిర్మాణాన్ని కానిచ్చేశారు. నిశితంగా గమనిస్తే ఈ రోడ్డు నిర్మాణం మూలంగా ఆయా గ్రామాల ప్రజలకు ఉపాధి కలగడం, ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కలగడం అనే లక్ష్యానికంటే కేవలం ఇంజనీర్లు-గుత్తేదార్లకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ఈ పని సాగింది. ఒక్క పనిని చూస్తేనే ఇలా ఉంటే మండలం లోనేకాకుండా ఏకంగా రంపచోడవరం ఐటీడీఏ మొత్తం పరిధిలో వందల కోట్ల రూపాయలను గుమ్మరించి ఇటువంటి పనులు ఎన్ని చేపట్టారో చూస్తే చాలావరకూ అన్ని పనుల్లోనూ ఇదే తరహా అక్రమాలు, నాణ్యతా లోపాలు చోటు చేసుకున్నాయని తెలుస్తోంది. పనులన్నిటిపైనా సమగ్ర విచారణ జరిపితే బాగోతాలన్నీ బట్టబయలవుతాయని తెలుస్తోంది.

ఉపకారం పొందండి.. ప్రతిభే కొలమానం

- నిరుపేద విద్యార్థులకు కేంద్రప్రభుత్వ సహకారం
- ఏటా రూ.12 వేలు.. నాలుగేళ్లపాటు సాయం

తుని రూరల్, ఆగస్టు 18: ప్రతిభ కనబరిచే పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తోంది. 8వ తరగతి చదివే పిల్లలు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అందించి వారిని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే 2024-25 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 6 వరకు గడువుగా నిర్ణయించింది. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నాలుగేళ్లపాటు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. గత ఏడాది జిల్లాలో 2 వేలమందికి పైబడి ఉపకారవేతనాలకు ఎంపికయ్యారు. ఈ ఏడాది మరింత మంది ఉపకార వేతనాలు అందుకునే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించి శిక్షణ ఇస్తున్నారు.

అర్హతలు ఇవీ..

ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలలతోపాటు ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులకు 7వ తరగతిలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు 50శాతం మార్కులు రావాలి. కుల ఆదాయ ధ్రువపత్రాలతోపాటు 7వ తరగతి ఉత్తీర్ణత పత్రాలు ఉండాలి.

ఇదీ పరీక్ష విధానం

డిసెంబరు 8న ఉదయం 10 నుంచి 1గంట వరకు 180 మార్కులకు పరీక్ష ఉంటుంది. దీంతో మెంటల్ ఎబిలిటీ 90 మార్కులు, స్టాటిస్టిక్ ఎబిలిటీ 90 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. 7,8 తరగతులకు చెందిన గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాల్లో ఉంటుంది. ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ www.esv.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. దరఖాస్తులకు సంబంధించి విద్యార్థుల పూర్తి వివరాలను ప్రధానోపాధ్యాయుల సమక్షంలో నమోదు చేసుకుని ఎస్సీఎస్టీ దివ్యాంగ విద్యార్థులు రూ.50, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100 ఆన్‌లైన్ ద్వారా పరీక్ష రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

అన్నవరం దేవస్థానంలో.. గుర్తుతెలియని వ్యక్తి మృతి

అన్నవరం, ఆగస్టు 18: అన్నవరం దేవస్థానంలో తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు అన్నవరం ఎస్ఐ కిషోర్ తెలిపారు. అతడు దైవదర్శనానికి వచ్చిన వ్యక్తి కాదని, 2, 3 రోజులుగా అన్నవరం కొండకు విచ్చేసిన భక్తులను యాచిస్తున్నట్లు గమనించినట్లు ప్రైవేటు సెక్యూరిటీ వారు తెలిపారు. మృతదేహాన్ని హుటాహుటిన కిందకు తరలించి అన్నవరం కొండపై పండితులు సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టారు.



రత్నగిరి పార్కింగ్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రకృతి సోయగాలు.. పూల రాఖీలు









- కడియం నర్సరీల్లో రాఖీపుష్పాల కనువిందు

కడియం, ఆగస్టు 18: దేశవ్యాప్తంగా పేరు గాంచిన కడియం నర్సరీల్లో ప్రకృతి సోయగాల పూల రాఖీలు కనువిందు చేస్తున్నాయి. సోదరప్రేమను ప్రదర్శించే ఆత్మీయ శుభతరుణం రక్షాబంధన్ (రాఖీ పండుగ). ఈ పండుగ రోజు రక్షాబంధనాలు కట్టుకుని సోదరులు విలువైన కానుకలు ఇచ్చి సోదరీమణులపట్ల ఆత్మీయతను చూపిస్తారు. ఇటీవల పుట్టినరోజు, వివాహ వేడుకలకు బహుమతులు బదులు మొక్కలు ఇచ్చి పుచ్చుకునే సంప్రదాయం నడుస్తోంది. అచ్చంగా రాఖీల్లా గే కనిపించే పూలమొక్కలు రక్షాబంధన్ వేళ కానుకలు అవుతున్నాయి. ఫ్యాసీఫ్లోరా శాస్త్రీయ నామంతో పిలిచే ఈ రాఖీపుష్పాలు విభిన్న పరిమాణాల్లో, వివిధ ఆకృతులు, ఎరుపు, నీలం, తెలుపు తదితర విభిన్న రంగుల్లో విరబూ స్తూ నర్సరీల్లో కనువిం దు చేస్తున్నాయి. చక్కని పరిమాణంలో పువ్వు, దాని చుట్టూ సన్నని రేకులు ఉంటూ అందంగా కనిపించే ఈ రాఖీపుష్పాన్ని కౌరవులు-పాండవులు పుష్పమని కూడా పిలుస్తుంటారు.

బెహ్రాయిన్‌లో మామిడికుదురు యువకుడి ఆత్మహత్య

- ఉపాధి నిమిత్తం నెల క్రితమే విదేశానికి వెళ్లాడంటున్న కుటుంబసభ్యులు
- మృతిపై విచారణ జరపాలని డిమాండ్
- మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలని వేడుకోలు



దుర్గానాగసాయి(ఫైల్)

మామిడికుదురు, ఆగస్టు 18: నెల రోజుల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం బెహ్రెయిన్ వెళ్లిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అసలు అక్కడ ఏం జరిగిందో కుటుంబీకులకు తెలియదు. కానీ ఉరి వేసుకుని చనిపోయాడనే సమాచారం రావడంతో వారు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన దుర్గానాగ సాయి ఈనెల 22న ఇంటినుంచి బయలుదేరి 29వతేదీ నాటికి బెహ్రాయిన్ చేరుకున్నాడని అతడి మేనమామ ఉండపల్లి రమేష్ అలియాస్ శ్రీను ఆదివారం తెలిపాడు. అక్కడ పెట్రోలు బంకులో పనిచేస్తూ తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడని, ఏవిధమైన సమస్యలు ఉన్నట్టు తనతో చెప్పలేదని పేర్కొన్నాడు. చనిపోయే ముందు రెండు రోజులక్రితం కూడా ఫోన్‌లో మాట్లాడాడన్నారు. అతడితోపాటు కేరళకు చెందిన యువకుడు ఒకే గదిలో ఉంటున్నారని, తన మేనల్లుడి మృతిపై విచారణ జరిపించాలని, మృతదేహాన్ని స్వదేశం రప్పించేందుకు సహకరించాలని అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్‌తోపాటు పిగన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కోరానని తెలిపాడు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

సామర్లకోట, ఆగస్టు 18: సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధి సామర్లకోట-పిఠాపురం రైల్వే ట్రాక్ మధ్య 60ఏళ్ల వయస్సు గల వృద్ధుడు వేగంగా వెళుతున్న రైలు కింద పడి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు సామర్లకోట రైల్వేపోలీసులు ఆదివారం రాత్రి తెలిపారు. ఘోరక్‌పూర్-అసన్‌సోల్‌ల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు లోకోపైలట్ సామర్లకోట రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ జీకేఎస్ శ్రీదేవికి అందించిన సమాచారంతో సామర్లకోట రైల్వే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు నిర్వహించారు. మృతదేహానికి తెల్లటి చొక్కాపైన నల్లటి చుక్కలు, నీలం రంగుపై నలుపు గీతల లుంగీ, నీలం రంగుపై తెలుపు గీతలు గల టవల్, తెలుపు రంగు చెప్పులు, కుడితొడపై పుట్టుమచ్చలు కలిగి ఉన్నాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపారు.

మత్స్యకారుల వలకు చిక్కిన భారీ చేప

- అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో లభ్యమైన టేకి చేప



అంతర్వేది పల్లిపాలెం మినీఫిషింగ్ హార్బరులో బోటునుంచి ఎక్స్‌కవేటర్ సాయంతో తెస్తున్న టేకి చేప

అంతర్వేది, ఆగస్టు 18: అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల వలకు భారీ టేకి చేప చిక్కింది. దీన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో బోటునుంచి వెలికి తీశారు. పశ్చిమగోదావరి జిల్లా వేములదీవికి చెందిన బలగం వెంకటేశ్వర్లు చేపల బోటుపై కాకినాడ మత్స్యకారులకు ఈ టేకి చేప వలకు చిక్కింది. అంతర్వేది సముద్రంలో చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులకు దొరికిన ఈ భారీ చేపను అతికష్టంపై బోటుసాయంతో హార్బరు వద్దకు తీసుకువచ్చారు. 30మంది జాలర్లు తాళ్లతో పైకి లాగినా రాకపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో హార్బర్ ప్లాట్‌ఫామ్‌కు తీసుకువచ్చారు. అంతర్వేదిలో తక్కువ ధర పలకడంతో కాకినాడ కుంభాభిషేకం రేవుకు వ్యానుపై తీసుకువెళ్తామని మత్స్యకారులు తెలిపారు. వెయ్యి కిలోల పైబడి ఉండే ఈ భారీ టేకిచేపలు అరుదుగా వస్తాయని, వీటిని ముక్కలు కోసి ఉప్పు చేపగా అమ్ముతారని తెలిపారు.



అయినవిల్లి విఘ్నేశ్వరుడికి రూ.లక్ష విరాళం

అయినవిల్లి, ఆగస్టు 18: ముమ్మిడివరానికి చెందిన ముళ్లపూడి గణేష్ కుటుంబసభ్యులు ఆదివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద్ ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందించారు. అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

లోవలో భక్తుల కోలాహలం

- కిక్కిరిసిన క్యూలైన్‌లు
- ఆలయానికి రూ.3.76లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్, ఆగస్టు 18: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలలనుంచి వేలాదిగా వచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువ జామున ఆలయ పండితులు ప్రత్యేక పూజల తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించడంతో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయానికి తరలివచ్చిన భక్తులు వంటా వార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో కె.విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు చేశారు. అమ్మవారిని 20వేలమంది పైబడి భక్తులు దర్శించుకోగా దేవస్థానంలో వివిధ విభాగాల ద్వారా రూ.3.76లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

లారీలో గంజాయి రవాణా



స్వాధీనం చేసుకున్న గంజాయితో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

- హైవేపై తనిఖీల్లో భాగంగా రాజానగరంలో పట్టుకున్న పోలీసులు
- 100 కిలోలు గంజాయి, ఒక లారీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

రాజానగరం, ఆగస్టు 18: విశాఖ ఏజెన్సీ నుంచి తమిళనాడుకు గుట్టు చప్పుడు కాకుండా లారీలో తరలిస్తున్న రూ.5లక్షల విలువైన 100 కిలోల గంజాయిని రాజానగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ కలిసి రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా వజపడి మండలం వెప్పిలైపట్టిపుదురు గ్రామానికి చెందిన మరిముత్తు ఆరుముగమ్, పెరంబుదూరు జిల్లా సిరుమతూర్ మండలం కుదిక్కడు గ్రామానికి చెందిన వేల్ మురుగన్ కలిసి విశాఖ ఏజెన్సీనుంచి తమిళనాడుకు 100 కిలోల గంజాయిని బస్తాలతో లారీలో తరలిస్తున్నారు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ మనోహర్ తమ సిబ్బందితో కలిసి ఆదివారం జాతీయ రహదారిపై రాజానగరం హైస్కూల్ జంక్షన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా వీరు గంజాయితో పట్టుబడినట్లు తెలిపారు. విశాఖ ఏజెన్సీలో గంజాయిని తక్కువ రేటుకు కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రంలోని సేలం నగరానికి తీసుకెళ్లి ఎక్కువ ధరకు అమ్ముకునేలా వ్యాపారం నిమిత్తం రవాణా చేస్తున్నట్టు తెలిసిందన్నారు. వీరిలో వేల్ మురుగన్‌పై తిరుచ్చి పోలీస్‌స్టేషన్‌లో గతంలో గంజాయి కేసు నమోదైనట్టు డీఎస్పీ శ్రీనివాసులు చెప్పారు. నిందితులతోపాటు రూ.5లక్షల విలువైన గంజాయి, లారీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

ఏడాదిలో రూ.25లక్షల విలువైన గంజాయి స్వాధీనం

రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడాదికాలంగా ఏడు గంజాయి కేసులు నమోదు కాగా రూ.25 లక్షలు విలువైన 506.35 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 22మందిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ వివరించారు. ఈ కేసులకు సంబంధించి రెండు లారీలు, ఒక వ్యాన్, ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి తాగడం, రవాణా, వ్యాపార కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ మనోహర్, హెచ్‌సీ నాగేంద్ర, వీఆర్వో అప్పారావు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి



ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో సత్తి సూర్యనారాయణరెడ్డి, గౌతమ్‌రెడ్డి తదితరులు

- గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ కేర్ ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో వైద్యనిపుణులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 18: ప్రజలు కిడ్నీ వ్యాధులపై ముందస్తు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని రాజమహేంద్రవరం నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి, పలువురు వైద్యప్రముఖులు ఆస్పత్రిలోని ఐసీయూ, లేబోరేటరీ, ఇన్ పేషెంట్, ఆపరేషన్ థియేటర్ తదితర విభాగాలను ప్రారంభించారు. డాక్టర్ గౌతమ్ రెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జీవనశైలి మార్చుకోవడం ద్వారా కిడ్నీ, యూరాలజీ సంబంధిత వ్యాధులను నివారించవచ్చున్నారు. రాజమహేంద్రవరంలో అత్యున్నత ప్రమాణాలతో రోగులకు వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య సంస్థల ఛైర్మన్ గన్ని భాస్కరరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ వీర్రాజు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి వెండి ఆభరణాల బహూకరణ



మామిడికుదురు, ఆగస్టు18: మామిడికుదురు మండలం మొగలికుదురులో శ్రీరుక్మిణిసత్యభామ సమేతవేణుగోపాలస్వామికి గ్రామానికి చెందిన దండు భీమరాజు-విజయలక్ష్మి దంపతులు రూ.1.50లక్షల విలువైన వెండితో చేసిన వక్షస్థలం, శంఖు, చక్రాలను బహూకరించారు. ఆలయఅర్చకులు వెండి ఆభరణాలను సంప్రోక్షణ చేసి స్వామికి అలంకరించారు.

పొలంలో గుళికలు చల్లుతుండగా అస్వస్థత



కూలీలను 108 అంబులెన్స్‌లో అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

- 8మంది కూలీలు ఆస్పత్రికి తరలింపు
- బిక్కవోలు మండలం పందలపాకలో ఘటన
- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి పరామర్శ

అనపర్తి, ఆగస్టు 18: బిక్కవోలు మండలం పందలపాకలో వరిపొలంలో గుళికలు చల్లుతూ 8మంది వ్యవసాయ కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌ల సహాయంతో అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యసిబ్బంది తెలిపారు.

బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం.. బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన రైతు శ్రీధర్ నారాయణరెడ్డి తన 15 ఎకరాల వరి పొలంలో గుళికలు చల్లేందుకు పందలపాక, ఊలపల్లి, మాచవరం గ్రామాలకు చెందిన 9మంది కూలీలను నియమించుకున్నారు. వీరు 9ఎకరాల్లో గుళికలు చల్లి కొంతసేపు సేదతీరారు. అంతలో మరో కూలీ తెచ్చిన మజ్జిగను తాగి తిరిగి పనికి ఉపక్రమించారు. కొద్దిసేపటికే పందలపాకకు చెందిన టి.విజయ్‌కుమార్, సీహెచ్ దుర్గారావు, పి.రాంబాబు, వై.వినోద్‌కుమార్, మాచవరం గ్రామానికి చెందిన విజ్జన శ్రీను, పలివెల యాకోబు, తాతపూడి గోవిందు, ఊపల్లికి చెందిన ఆర్.వెంకటరమణలకు కళ్లు తిరుగుతూ ఊపిరి తీసుకోవడం కష్టమైంది. దీంతో యజమాని 108కి సమాచారం అందించాడు. దీంతో అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని బాధితులకు ప్రథమ చికిత్స అందించి అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు సేవలు ప్రారంభించడంతో ప్రాణాపాయంనుంచి బయటపడ్డారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రస్తుతం వీరంతా కోలుకుంటున్నారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, నూతిక బాబూరావు తదితరులున్నారు.

డీఎండీ వ్యాధి ప్రాణాంతకం

అమలాపురం టౌన్, ఆగస్టు 18: అభం శుభం తెలియని చిన్నారులకు డ్యుషెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ (డీఎండీ) వ్యాధి ప్రాణాంతకంగా నిలుస్తుందని భారత్ డీఎం ఫౌండేషన్ డైరెక్టర్ రామలక్ష్మి తెలిపారు. డీఎండీ చికిత్స అత్యంత ఖరీదు కావడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి వ్యాధి నివారణ టీకా తయారీకి కృషి చేసేలా చట్ట సభల్లో చర్చ జరగాలని కోరుతూ ఆదివారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతిపత్రం అందించారు.

భక్తి శ్రద్ధలతో హుస్సేన్ వాక్..



మామిడికుదురు, ఆగస్టు18:ఇరాక్ దేశంలోని నజఫ్ నుంచి కర్బలాకు నిర్వహించే హుస్సేన్ వాక్‌కు సమాంతరంగా నగరం నుంచి పాశర్లపూడిలోని దర్గాకు నిర్వహించే హుస్సేన్ వాక్‌ను భక్తిశ్రద్ధలతో శనివారం రాత్రి జరిగింది. నగరంలోని పెదపంజీష నుంచి నిర్వహించినఈవాక్‌లో అధికసంఖ్యలో ముస్లింలు పాల్గొని కర్బలా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. హుస్సేన్ జిందాబాద్ అనే నినాదంతో సాగిన వాక్‌లో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని ముస్లింలకు సంఘీభావం తెలిపారు. నగరం నుంచిపాశర్లపూడి వరకు జాతీయ పతాకాలు, ఇమామ్ హుస్సేన్ జెండాలను ప్రదర్శిస్తూ వాక్ జరిగింది. మహ్మద్ ఖాసింరజా(రజ్వీ), ఆలందార్‌అబ్బాస్, నూరేస్‌అబ్బాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికసంఖ్యలో మహిళా భక్తులు, చిన్నారులు పాల్గొనడం విశేషం. దారి పొడవునా హిందువులతో పాటు పలువురు కార్యక్రమానికి సంఘీభావం తెలియజేస్తూ ప్రసాదాలు పంపిణీ చేశారు.పాశర్లపూడిలోని బీబీఫాతిమా జెహరా వద్ద మాతం నిర్వహించి కర్బలా వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

మలికిపురం, ఆగస్టు 18: మలికిపురం పోలీసుస్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.సురేష్ అన్నారు. ఆదివారం మలికిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయి విక్రయించినా, సేవించినా చర్యలు తప్పవన్నారు. సులువుగా డబ్బుసంపాదించేందుకు కొందరు యువత చెడు మార్గాలు అనుసరిస్తున్నారని, వారి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హితవు పలికారు.

విద్యార్థుల నిరసన ర్యాలీ

మలికిపురం, ఆగస్టు18: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తూ గుర్రయ్య ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఆదివారం శాంతి ర్యాలీ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. నల్ల బ్యాడ్జీలు ధరించి బట్టేలంక సెంటర్‌లో మానవహారం చేపట్టారు. కరస్పాండెంట్ ఎంవీ సత్యప్రసాద్, ఏవీ నాయుడు, కె.రాంబాబు, అరుణకుమార్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదుకండి

మలికిపురం, ఆగస్టు18: ఆయుష్మాన్ భారత్ పథకంలో ప్రతీ ఒక్కరూ నమోదు కావాలని బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, అడబాల సత్యనారాయణ కోరారు. ఈపథకంలో ప్రతీ ఒక్కరికీ రూ.5లక్షల వైద్యం ఉచితంగా దేశంలో ఏ కార్పొరేట్ ఆసుపత్రిలో అయినా వైద్య సహాయం పొందవచ్చన్నారు.

గీతా మందిరంలో రక్షాబంధన్

రాయవరం, ఆగస్టు18: వెదురుపాక గీతా మందిరంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ ప్రతినిధి బీవీరభద్రరాజు పాల్గొని కుటుంబ ప్రబోధన్, స్వదేశీ స్వావలంబన అంశాలపై బాల, బాలికలకు అవగాహన కల్పించారు. భగవద్గీత పారాయణం నేర్చుకుంటున్న చిన్నారులు రాఖీలు కట్టికునిరక్షా బంధన్ జరుపుకున్నారు. గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి, పడాల శివ మణికంఠరెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



అమలాపురం రూరల్, ఆగస్టు 18: సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జనుపల్లిలోని మెట్ల సత్యనారాయణరావు కాలనీలో ఉన్న విజయగణపతి ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. సర్పంచ్ గానాల భారతి, ఈతకోట నాగేశ్వరరావు, ఆర్లపల్లి ముత్యం, లంకపల్లి శ్రీరామమూర్తి, నల్లా కరుణాకర్, కాంద్రేగుల రాము, చొల్లంగి కాశీ పాల్గొన్నారు.

భాషా పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయాలి

శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, ఆగస్టు 18: భాషా పరిరక్షణకు తెలుగువారంతా అంకిత భావంతో కృషి చేయాలని శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ అన్నారు. తెలుగు భాషా పరిరక్షణలో కవులు, కళాకారులు తెలుగు అధ్యాపకులు కృషి సాగించాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి మాకే బాలార్జునసత్యనారాయణ ఆధ్వర్యంలో అమలాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం వ్యవహారిక భాషోద్యమ నిర్మాత గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో తెలుగుభాషా సంబరాలు నిర్వహించారు. కవుల వేషధారణ ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకువచ్చేందుకు శ్రీశ్రీ కళావేదిక చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌ను ఎమ్మెల్యే ఆనందరావు ఆధ్వర్యంలో సత్కరించారు. సాహితీరంగంలో ఉత్తమ సేవలందించిన కొల్లి రమావతి, నన్నయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ తరపట్ల సత్యనారాయణ, సాహితీవేత్త మాకే బాలార్జున సత్యనారాయణ, ప్రముఖ రచయిత్రి సీహెచ్ లలిత, ఈశ్వరీభూషణం, డాక్టర్ టి.పార్థసారథి, డాక్టర్ వై.బుజ్జిలను సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీకళావేదిక జిల్లాశాఖ ప్రతినిధులు బీవీవీ సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి మాట్లాడారు. అనంతరం 138వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన 150మంది కవులు కవితల ద్వారా తెలుగు భాషా వైభవాన్ని, సంస్కృతిని ఆవిష్కరించారు. సెప్టెంబరు 29న అనకాపల్లిలో శతాధిక కవి సమ్మేళనం అక్టోబరులో గోదావరి అలలపై పాపికొండల్లో కవిసమ్మేళనం నిర్వహిం చనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి, జల్లి సుజాత, కుంపట్ల సుభాషిణి, అరిగెల బలరామమూర్తి, పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి, గుర్రం రామకృష్ణారావు పాల్గొన్నారు.

21న బంద్‌ను విజయవంతం చేయాలి

రాజోలు, ఆగస్టు 18: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బహుజన సంఘాల పిలుపుమేరకు ఈనెల21న చేపట్టే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని నాలుగు మండలాల జేఏసీ ముఖ్య సలహాదారు బత్తుల మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం రాజోలులో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి యువత త్యాగాలకుసిద్ధం కావాలన్నారు.

సీఐ నరేష్‌కుమార్ పూజలు

అంతర్వేది, ఆగస్టు 18: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారిని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. సీఐ దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఎంపీటీ బైరా నాగరాజు, అయినపర్తి ఏసు తదితరులు పాల్గొన్నారు.

దుర్గారావు కుటుంబానికి ఆర్థిక సాయం

అంతర్వేది, ఆగస్టు 18: ఇటీవల సంభవించిన వరదల సమయంలో సఖినేటిపల్లికి చెందిన చీర్ల దుర్గారావు మృతిచెందిన విషయం తెలిసిందే. లిటిల్ హార్ట్స్ సేవా సంస్థ సభ్యులు ఆదివారం దుర్గారావు కుమార్తె, కుమారుడికి రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో నాయుడు కృష్ణ, లిటిల్ హార్ట్స్ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

శిథిలస్థితిలో కడలి చిల్లు వంతెన

- శిథిల వంతెనపైనే వాహనాల రాకపోకలు
- నూతన వంతెన నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి



కడలిలో పునాదులు కూలిన చిల్లు వంతెన

రాజోలు, ఆగస్టు 18: బ్రిటీషు కాలంలో నిర్మించిన చిల్లు వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాజోలు మండలం కడలి చిల్లు వంతెన అడుగు భాగంలో పునాదులు కూలి పలుచోట్ల బీటలు వారాయి. ఈవంతెన మీదుగా నిత్యం స్కూలు బస్సులు, విద్యార్థులు, ద్విచక్రవాహనాలు, కారులు, లారీలు, ఆటోలు రాకపోకలు సాగిస్తుంటారు. మామిడికుదురు మండలం గెద్దాడ, కరవాక, గోగన్నమఠం, రాజోలు మండలం మెరకపాలెం, కాట్రేనిపాడు, పొన్నమండ, ములికిపల్లి, వేగివారిపాలెం, కడలి గ్రామాల నుంచి ప్రయాణికులు ఈవంతెన మీదుగా నిత్యం రాజోలుకు వెళుతుంటారు. ప్రభుత్వ కార్యాలయాలకు వాహనదారులు ఈవంతెన మీదుగా ప్రయాణిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే కడలి చిల్లు వంతెనకు పెనుముప్పు తప్పదని వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈచిల్లు వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలంటూ ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



కడలిలో శిథిలస్థితికి చేరిన చిల్లు వంతెన

అత్యాచార నిందితులను శిక్షించాలని ఆందోళన



అమలాపురంలో మహిళా డాక్టర్ అత్యాచార ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్సీ ఐవీ

అమలాపురం టౌన్, ఆగస్టు 18: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ పలు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లాశాఖ, ఎస్ఎఫ్ఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీకి పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అశ్లీల వెబ్‌సైట్‌లను నియంత్రించే పని కేంద్ర ప్రభుత్వం చేపట్టాలన్నారు. యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్యూటీలో ఉన్న మహిళా వైద్యులు, నర్సులకు ప్రభుత్వం రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. అనంతరం చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో జిల్లా కార్యదర్శులు పెన్నాడ శ్రీనివాస్, బి.చంద్రకళ, కుడుపూడి శ్రీనివాస్, వై.మురళీకృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.శంకర్, శశి, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కారెం వెంకటేశ్వరరావు, భీమాల శ్రీను తదితరులు పాల్గొన్నారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు గడియార స్తంభం సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుష దాడిని నిరసిస్తూ క్రీడాకారులు కోనసీమ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, యెనుముల కృష్ణపద్మరాజు, కంకిపాటి వెంకటేశ్వరరావుతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ప్రదర్శన

అంతర్వేది, ఆగస్టు 18: పీజీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్యను నిరసిస్తూ వీవీమెరక కూటమి నాయకుల ఆధ్వర్యంలో గాంధీనగర్ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. వీవీమెరక జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు పురం వెంకటరమణ, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చెల్లుబోయిన జయసూరిబాబు, తాడి సత్యనారాయణ, కొండా శివయ్య, మెండు జ్యోతి, రావి అంజనాదేవి, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం సమావేశంలో ఉద్రిక్తత



పరిస్థితిని చక్కదిద్దుతున్న సీఐ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు18: రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం శెట్టిబలిజ సంఘం భవనంలో ఉద్రిక్తతల నడుమ జరిగింది. అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో డీఎస్పీ, సీఐ, పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది మొహరించారు. ఇటీవల శెట్టిబలిజ సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా మంత్రి సుభాష్ అనుచరుడు, టీడీపీ నాయకుడు దొంగల శ్రీధర్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అయితే ఆ ఎన్నిక చెల్లదంటూ శెట్టిబలిజ సంఘం మాజీ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక సమావేశం ఎంపీ బోస్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశానికి ఎంపీ బోస్, ఆయన కుమారుడు సూర్యప్రకాష్, పలు గ్రామాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో కట్టా సూర్యనారాయణ మాట్లాడుతూ తమ కార్యవర్గం రాజీనామా చేశామని ప్రకటించి ఎన్నిక గురించి మాట్లాడుతూ పరుష పదజాలం ఉపయోగించడంతో తీవ్ర గలాటా చోటు చేసుకుంది. ఈదశలో సీఐ కడియాల అశోక్ జోక్యం చేసుకుని ఇరువర్గాలను గెంటివేసి సమావేశం జరపవద్దని కోరారు. ఈదశలో ఎంపీ బోస్ మాట్లాడుతూ సంఘం పూర్వం నుంచి జరిగిన పరిణామాలు వివరించారు. గత ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. పోలీసుల సమక్షంలో సమావేశం జరగడం సిగ్గు చేటని, సంఘం ఐక్యత దెబ్బతిన్నట్లేనని సభ్యులను సముదాయించారు. పోలీసులు బయటకు వెళ్లిపోవాలని కోరారు. ఏదైనా జరిగితే మొదట తనను అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. తిరిగి సమావేశం ప్రారంభించారు. దొంగల శ్రీధర్ మాట్లాడుతూ తన న్యాయకత్వంపై ఆరోపణలకు సంబంధించి తాళ్లపొలం జరిగిన సంఘటనను ఉదహరిస్తూ మాజీ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడంతో మళ్లీ ఉద్రిక్తత, తోపులాట చోటు చేసుకుంది. దీంతో పోలీసులు మళ్లీ రంగ ప్రవేశం చేసి సమావేశాన్ని వాయిదా వేయించారు.

శ్రీధర్ అధ్యక్షుడిగా కార్యవర్గం కొనసాగుతుంది

గతంలో ఎన్నిక జరిగిన ప్రకారం అధ్యక్షుడిగా దొంగల శ్రీధర్, ఇతర కార్యవర్గం కొనసాగుతుందని మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ, శెట్టిబలిజ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు పలివెల వెంకట రమణ తదితరులు ప్రకటించారు. స్వీట్లు పంపిణీ చేశారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని దొంగల శ్రీధర్ ప్రకటించారు.

వైభవంగా సీతారాములు, వేంకటేశ్వరస్వామి కల్యాణం



సీతారాముల సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

రాయవరం, ఆగస్టు 18: వెదురుపాక విజయదుర్గా పీఠం 52వ వార్షికోత్సవాలు ఆఖరి రోజు శనివారం సీతారామస్వామికి సామ్రాజ్య పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమనం ప్రకారం భద్రాచలం వేదపండితులు సీతారామస్వామికి కల్యాణం, సామ్రాజ పట్టాభిషేకం కన్నుల పండుగగా నిర్వహించారు. తొలుతగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సీతారామస్వామి దివ్యకల్యాణం, సహస్రనామ అర్చనలు జరిపిన అనంతరం సామ్రాజ్య పట్టాభిషేకం శాస్త్రోక్తంగా జరిపారు. సామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా పాదుకా సమర్పణ, రాజముద్రిక, రాజదండకం, నందక, ఛత్రచామర, ఆభరణాల సమర్పణ నదీజలాలతో అభిషేకం, తీర్థాలు, చతుల సముద్రాది జలాలతో అభిషేకం, మంగళాశాశనం, వంటి పూజలు జరిపి నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం తిరుపతికి చెందిన వేదపండితులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైఖానస ఆగమనం ప్రకారం జరిపారు. వైఖానస పండితుడు బాలాజీ శ్రీనివాసుని కల్యాణం విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో పీఠాధిపతి గాడ్, అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెద్దపాటి సత్యకనకదుర్గ, పీఆర్వో బాబి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూములపై విచారణ జరపాలి

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి



కొత్తపేట, ఆగస్టు 18: గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల స్థలాల పేరిట భూముల కొనుగోలులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి కోరారు. కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 348ఎకరాలు రూ.179కోట్లతో కొనుగోలు చేశారన్నారు. అయితే ఈభూములు ఊరు కాని ఊర్లలో లబ్ధిదారులకు ఉపయోగపడని స్థలాలను కొనుగోలుచేసి పంపిణీ చేశారని, అవి నేటికీ ఎక్కడున్నాయో తెలియని పరిస్థితులు దాపురించాయన్నారు. అంతేకాకుండా భూములు కొనుగోలు నాటికి వాటి విలువకు రెట్టింపుకు కొనుగోలుచేసి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణచేసి అకవతవకలను వెలికి తీయాలని బాబ్జి కోరారు. ఈవ్యవహారంలో భాగస్వాములపై చర్యలు చేపట్టాలన్నారు.

అమెరికాలో ఇంటర్న్‌షిప్‌కు చంద్రబాబు ఎంపిక



అమలాపురం టౌన్, ఆగస్టు 18: అమలాపురం పట్టణానికి చెందిన విద్యార్థి పిల్లాడి మధుకృష్ణచంద్రబాబు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని సంస్కృతి, సంప్రదాయాలను అధ్యయనం చేసే కార్యక్రమంలో భాగంగా ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యాడు. పంజాబ్‌లోని లూధియానా సిటీ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీలో డిగ్రీ డిస్టెన్సన్‌లో ఉత్తీర్ణుడయ్యాడు. పేద కుటుంబానికి చెందిన చంద్రబాబు చదువు కోసం సినీ నటుడు సోనూసూద్ స్పందించి రూ.10లక్షలు ఆర్థికసాయం అందించారు. డిగ్రీ ఉత్తీర్ణుడైన విద్యార్థికి అదే యూనివర్సిటీ జే-1 వీసాపై హాస్పిటాలిటీ స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్‌గా 12నెలలపాటు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో అధ్యయనం చేసేందుకు ఎంపిక చేశారు. ఈఏడాది అక్టోబరులో చంద్రబాబు అమెరికా వెళ్లనున్నారు. విద్యార్థి అమెరికా పయనానికి గంటా శ్రీనివాస్‌కృష్ణబలిజ రూ.30వేలు విరాళంగా అందజేశారు. తన చదువుకు సహకరించిన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుకు, బాబి గాబ్రియేల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా వెళ్లనున్న చంద్రబాబును పలువురు అభినందించారు.

సివిల్ ఇంజనీరింగ్‌లో హారికకు బంగారు పతకం



ద్రాక్షారామ, ఆగస్టు 18: తాడేపల్లిగూడెం ఏపీ నీట్ సివిల్ 2020-2024 బ్యాచ్ సివిల్ ఇంజనీరింగ్‌లో 9.12శాతం గ్రేడ్ పాయింట్లతో రామచంద్రపురం మండలం తాళ్లపొలం గ్రామానికి చెందిన గుబ్బల హారిక పతకం సాధించింది. ఇటీవల ఏపీనీట్ స్నాతకోత్సవంలో హారికకు బంగారు పతకం ప్రదానం చేశారు. హారిక తండ్రి శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి కనకలత ఉపాధి హామీ పథకంలో జేఈగా పనిచేస్తున్నారు. ఈఎస్‌సీ సర్వీసెస్ సాధించి ఇంజనీర్‌గా స్థిరపడాలన్నదే ఆశయమని హారిక తెలిపింది.

ఉచిత మెగా వైద్య శిబిరం

రాజోలు, ఆగస్టు 18: మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం వేగివారిపాలెంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రాజోలు తాలూకా చిరుపవన్ సేవాసమితి అధ్యక్షుడు గుం డాబత్తుల తాతాజీ ప్రారంభించారు. ప్రముఖ వైద్యుడు ఫణి, ఆర్థోపెడిక్, డెంటల్ విభాగాల వైద్యులు సేవలం దిం చారు. జనసేన పార్టీ మండల అధ్య క్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, కోళ్ల బాబి, గొల్లమందల పూర్ణచంద్రరావు, ఉలిశెట్టి లక్ష్మణరావు, కటికిరెడ్డి బుజ్జి, లంకలపల్లి సుబ్బారావు, వాణరాసి శ్రీరామ్, వేగి శ్యామ్, కె.ప్రభాకరరావు, వేగి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: మిస్టర్ బచ్చన్
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: డబుల్ ఇస్మార్ట్
శేఖర్ స్క్రీన్-2	: వేద
రమా	: ఆయ్
గణపతి	: రాయన్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: డబుల్ ఇస్మార్ట్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: తంగలాన్

సంస్కృత భాషా దినోత్సవం

అంతర్వేది, ఆగస్టు 18: ప్రపంచంలో అతి ప్రాచీనమైన భాషగా ఈ నాటికి జీవనదిగా పండితుడి నుంచి సామాన్యుడి వరకు వాడుకలో ఉన్న భాష సంస్కృత భాష ఒక్కటేనని కవి, భాషా పండితులు, సమీక్షకుడు పెద్దింటి శేషాప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లిపాలెంలోని శ్రీవశిష్ట జూనియర్ కళాశాలలో సంస్కృత భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథి శేషప్రసాద్, సంస్కృతిక శాఖాధిపతి సాయిరామ్‌లను, ఇతర సిబ్బందిని పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పోతురాజు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కె.సతీష్‌కుమార్, ఇన్‌చార్జి పి.భరత్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి

అమలాపురం టౌన్, ఆగస్టు 18: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు అమలాపురం ఎంప్లాయీస్ హోమ్‌లో ఆదివారం బహుమతులు అందించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు సమాజం పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పలు పోటీల విజేతలకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, సీనియర్ నాయకుడు బీఎస్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కన్వీనర్లు కె.శంకర్, శశి, రిత్విక్, సంతోష్, సంజన పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

మామిడికుదురు, ఆగస్టు 18: పార్టీలకు అతీతంగా మాలల న్యాయపోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల21వతేదీ నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజు కోరారు. బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం మామిడికుదురులోని ఎస్సీ సామాజిక భవనంలో ఆవిష్కరించారు. నల్లి శ్రీనివాస్, కలిగితి పల్లంరాజు, నెల్లి దుర్గాప్రసాద్, బత్తుల జనార్ధనరావు, పొలమూరి కుమార్ పాల్గొన్నారు.

సచివాలయంలో ప్రజాప్రతినిధుల ఫొటోల ఏర్పాటు

ద్రాక్షారామ, ఆగస్టు18: కాపవరం గ్రామసచివాలయంలో ఆదివారం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రిసుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్‌ల చిత్రపటాలను ఆవిష్కరించారు. సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ రెడ్నం సతీష్‌బాబు, జనసేన, టీడీపీ కార్యకర్తలుపాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం..

అమలాపురం రూరల్, ఆగస్టు 18: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాజ్‌కమల్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ప్రవాసాంధ్రుడైన యర్రమిల్లి జయరామ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 8వతరగతి చదువుతున్నవిద్యార్థులకు ముందుగా ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వ ఫీజుకు సంబంధించి రుసుం చెల్లించడమే కాకుండా స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్టు జయరామ్ తెలిపారు. గతఏడాది జిల్లాలో 400మందివిద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించి స్టడీ మెటీరియల్ అందించామన్నారు. ఆసక్తి కలిగిన పాఠశాలల ఉపాధ్యాయులు ముందుగా సెల్ 9989027829ను సంప్రదించాలని గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి కోరారు. ఆయా పాఠశాలల్లోనే ప్రవేశ పరీక్ష నిర్వహించి విద్యార్థుల ప్రతిభను గుర్తించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.

చిరంజీవి జన్మదిన సేవా కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరణ

ఉప్పలగుప్తం, ఆగస్టు 18: చిరంజీవి జన్మదినం సందర్భంగా ఈ నెల 22న నిర్వహించే రక్తదాన శిబిరం, ఇతర సేవా కార్యక్రమాలపై ఆదివారం మెగా ఫ్యామిలీ అభిమానుల ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గొల్లవిల్లి శ్రీభీమేశ్వరా ఆడిటోరియంలో సమావేశమైన అభిమానులు సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. సమావేశంలో కడియం సందీప్, సుందరనీడి ఏసు, మద్దింశెట్టి ప్రసాద్, చీకట్ల శ్రీను, ఆకేటి పళ్లంరాజు, గనిశెట్టి వీరు, నిమ్మకాయల రాజేష్, గొలకోటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడాభారతి



వెంకన్నాయుడును సన్మానిస్తున్న క్రీడాభారతి ప్రతినిధులు

అమలాపురం టౌన్, ఆగస్టు 18: గ్రామీణ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో క్రీడా భారతి సంస్థను ఏర్పాటు చేసినట్టు జిల్లా శాఖ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు తెలిపారు. అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం శరత్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామీణ క్రీడాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈసందర్భంగా సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ డిసిప్లేనరీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన వంటెద్దు వెంకన్నాయుడు, ఉపాధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొమ్మేటి వెంకటరమణలను క్రీడాభారతి తరపున సత్కరించారు. ఆగస్టు 15న బెస్ట్ సర్వీసు అవార్డులు పొందిన క్రీడా శిక్షకులు ఐ.బీమేష్, విష్ణుప్రసాద్, అడబాల విజయ్‌శ్రీనివాస్, పురుషోత్తంనాగదుర్గ, తాతపూడి అబ్బులును సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, గౌరవాధ్యక్షుడు రంకిరెడ్డి కాశీ, క్రీడాభారతి ప్రాంతీయ కార్యదర్శి జొన్నలగడ్డ గోపాలకృష్ణ, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

అయినవిల్లి, ఆగస్టు 18: అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరవల్లిపాలెంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు సేవలందించారు. చైర్మన్ ముద్రగడ త్రినాధరావు ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. 500మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సలాది బుచ్చిరాజు, ముద్రగడ రామకృష్ణారావు, చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, సలాది పుల్లయ్యనాయుడు, అడపా నాగభూషణం, వైద్య సిబ్బంది శివగణేష్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

దంగేరు కార్యదర్శికి ఉత్తమ సేవా పురస్కారం

కె.గంగవరం, ఆగస్టు 18: దంగేరు గ్రామ కార్యదర్శి కె.వి.వి.సత్యనారాయణకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. అమలాపురంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నుంచి ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనను ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, దంగేరు సర్పంచ్ కొప్పిశెట్టి వెంకట రమణ, మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్‌చౌదరి, కార్యదర్శుల సంఘం నాయకుడు ముద్రగడ సత్యనారాయణ, పలువురు కార్యదర్శులు అభినందించారు.

175మందికి నేత్ర పరీక్షలు

ద్రాక్షారామ, ఆగస్టు 18: వల్లూరి కామేశ్వరరావు జ్ఞాపకార్థం నెలపర్తిపాడులో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు 175మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వల్లూరి వీరవెంకట సూర్యనారాయణ చౌదరి, రాయుడు వీర్రాజు, వల్లూరి సురేష్‌బాబు, చుండ్రు రామకృష్ణ, వల్లూరి సత్యనారాయణమూర్తి, చిట్టూరి సత్యనారాయణ, తాతపూడి కుమార్ బాబు పాల్గొన్నారు.

కవి సుబ్బారావుకు ఘన సత్కారం

కొత్తపేట, ఆగస్టు 18: శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురంలో జరిగిన జాతీయ కవి సమ్మేళనంలో కొత్తపేటకు చెందిన డాక్టర్ కె.సుబ్బారావు వినిపించిన కవితాగానం పలువురి ప్రశంసలు అందుకుంది. ఈనేపథ్యంలో సుబ్బారావును కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, బాలార్జున సత్యనారాయణ ఆధ్వర్యంలో సత్కరించారు. కవులు కొల్లి రమావతి, బీవీవీ సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, జినిపే భీమారావుపాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

ముమ్మిడివరం, ఆగస్టు 18: చినకొత్తలంక గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా కార్యదర్శి పొత్తూరి విజయభాస్కరవర్మ ఇటీవల మృతిచెందారు. భాస్కరవర్మ కుటుంబ సభ్యులను ఆదివారం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన వెంట నాయకులు చెల్లి అశోక్, అర్థాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, వీపూరి సత్యనారాయణరాజు, వీపూరి నాగరాజువర్మ, పొత్తూరి నాగరాజువర్మ, గీసాల చంద్రరావు, దాసరి సాయిబాబు, బొంతు నాగరాజు, చింతలపూడి కొండబాబు, గోదశి గణేష్, గేదెల రఘునాథబాబు, చిట్టిరాజు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఆలమూరు, ఆగస్టు 18: చొప్పెల్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కాకినాడలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. శనివారం చొప్పెల్ల వద్ద డివైడర్ దాటుకుని రోడ్డు దాటడానికి నిరీక్షిస్తున్న ముగ్గురిపైకి వ్యాన్ దూసుకెళ్లడంతో గాయపడిన విషయం విదితమే. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అడబాల సత్యనారాయణ(57)ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి శనివారం తరలించారు. అయితే అతడు అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఆలమూరు పోలీసులు తెలిపారు.

శిఖర ప్రతిష్ఠా మహోత్సవం

రావులపాలెం, ఆగస్టు 18: ముమ్మిడివరప్పాడు గ్రామదేవతశ్రీగరగాలమ్మ అమ్మవారి ఆలయ శిఖర ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకుడు కిరణ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం, పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవం తదితర పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగాయి. భక్తులుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు రాజీవ్‌గాంధీ జయంతి

అమలాపురం టౌన్, ఆగస్టు 18: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని బండారులంకలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈనెల20న నిర్వహించనున్నట్టు జిల్లా శాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తెలిపారు. ఈసందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఆత్రేయపురం, ఆగస్టు 18: ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి శ్రవణా నక్షత్ర కల్యాణం అశేష భక్తజనం నడుమ కమనీయంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.